క్లుప్తంగా

బొత్సను కలిసిన ఎమ్మెల్సీ నర్తు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: విశాఖ జిల్లా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను ఎమ్మెల్సీ నర్తు రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం విశాఖపట్నంలోని బొత్స క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్రలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని, పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

కవిటి: కవిటికి చెందిన పొల్లాయి జశ్వంత్‌కు విశాఖపట్నంలోని అనిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సాధించాడు. పేద విద్యార్థి కావడంతో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న చింతామణి అమ్మవారి ట్రస్టు ప్రతినిధులు రూ.50000 ఆర్థిక సాయాన్ని శనివారం జశ్వంత్ తల్లి హేమలతకు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదకు చేయూత



జానకమ్మకు నగదు అందిస్తున్న సర్పంచ్

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన నిరుపేద చిట్టి జానకమ్మకు రష్యాలో పనిచేస్తున్న గ్రామ యువకులు అండగా నిలిచారు. శనివారం సర్పంచ్ చింత హేమారావు చేతుల మీదుగా రూ.25వేలు నగదు అందించారు. కె.కృష్ణారావు, డి.చంద్రశేఖరరావు, సీహెచ్.కేశవరావు, భానుమూర్తి, ఢిల్లేశ్వరరావు తదితరులు కలిసి ఈ మొత్తం సమకూర్చారు. కార్యక్రమంలో డి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దుద్ది శ్రీనివాసరావు

సోంపేట: సోంపేట యువత ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక తెలగవీధి ప్రాథమికోన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన పిరియా వర్ష, పసుపురెడ్డి శ్రీలేఖ, ఎం.మీనాక్షిలకు శనివారం బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఎస్.ఎస్.ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దుద్ది శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతరం సేవాసమితి ఔదార్యం



చెక్ అందిస్తున్న యువతరం సేవా సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: చినవంక గ్రామానికి చెందిన వండరి ఢిల్లేశ్వరరావు అనారోగ్యానికి గురై విశాఖలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో పూండికి చెందిన యువతరం సేవా సమితి ప్రతినిధులు శనివారం రూ.15వేలు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి వ్యవస్థాపకుడు చింత మురళి, మైత్రీ ఫౌండేషన్ రాకేష్, గొరకల సునీల్, బి.విఘ్నేశ్వరరావు, పుష్పలత, అజయ్, లోకేష్, గణేష్, లక్ష్మణరావు, జగదీష్ వెంకటేష్, సోమేష్, బాలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం ఎంపీడీఓగా ఈశ్వరరావు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.ఈశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు ఈయన విజయనగరం సీతాపురం ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా విధులు నిర్వహించిన వై.వి.రాజేంద్రప్రసాద్ రెండు రోజుల క్రితం బదిలీపై విజయనగరం వెళ్లడంతో ఆయన స్థానంలో ఈశ్వరరావు నియమితులయ్యారు.

రైతుల నిరసన

కాశీబుగ్గ: ఎరువుల కోసం వస్తుంటే బిల్లులు తారుమారు చేసి అదనంగా నగదు వసూలు చేస్తున్నారంటూ పలువురు రైతులు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పాతజాతీయ రహదారిపై ఉన్న రెగ్యులర్ ఎరువుల షాపు వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. అధికారులు దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



సోంపేట: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ వైద్యులు



కాశీబుగ్గ: పలాస జీడిపిక్క బొమ్మ వద్ద సీహెచ్‌సీ వైద్యుల నిరసన



వజ్రపుకొత్తూరు రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న అక్కుపల్లి వైద్య సిబ్బంది

కోల్‌కతా ఘటనపై.. నిరసన గళం

- విధులు బహిష్కరించిన వైద్య సిబ్బంది
- నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్
- ప్రధాన కూడళ్లలో ర్యాలీలు, మానవహారాలు



టెక్కలి: మానవహారం చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, పీహెచ్‌సీ వైద్యులు

టెక్కలి: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై దారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం టెక్కలిలో ఆరోగ్య కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మహిళా వైద్యులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొవ్వొత్తులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు.

టెక్కలిరూరల్: స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు హాస్పిటల్ నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ మహరాజ్, వైద్యులు అపర్ణ, గాయత్రీ, జ్ఞానప్రసూన, స్రవంతి, లక్ష్మణరావు, రాజేష్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు శనివారం విధులు బహిష్కరించారు. పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంఘాలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భం డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, ప్రధాన శివాజీ తదితరులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలు తీయడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎ.వి.రామకృష్ణ , లక్ష్మీనారాయణ, తుంగాన వెంకటేష్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. బారువ సామాజిక ఆసుపత్రిలో వైద్యసిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.బాలకృష్ణ, పెద్దింటి దుర్యోధన, హిందుసింహా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: కవిటి సీహెచ్‌సీ, బెలగాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాంజీ, డాక్టర్ బి.సురేష్‌కుమార్, బెలగాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు పి.రాకేష్, డి.కవిత, సిబ్బంది శివప్రసాద్, అనిత తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి మూడు రోడ్ల కూడలిలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారులు,సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ : పలాసలో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కేటీ రోడ్ మీదుగా కాశీబుగ్గ బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి నినాదాలు చేశారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వీరికి ఎమ్మెల్యే గౌతు శిరీష సంఘీభావం పలికారు. నిందితులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇచ్ఛాపురం: బెల్లుపడ కాలనీ-2 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపిహెచ్‌సి) వైద్యసిబ్బంది విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు అఖిల్‌మనోహర్, సిబ్బంది రఘుబాబు, నీలవేణి, రాఘవ,లక్ష్మి, రామారావు, అర్జున్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మహిళలకు ప్రభుత్వాలే రక్షణ కల్పించాలని స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ కోరారు. కలకత్తా ఘటనను వ్యతిరేకిస్తూ ఇచ్ఛాపురం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న స్వర్ణభారతి విద్యార్థులు



ఇచ్ఛాపురం: బెల్లుపడకాలనీ యూపీహెచ్‌సీ వద్ద నిరసన తెలియజేస్తున్న వైద్యసిబ్బంది



కవిటి: బెలగాం ఫ్లైఓవర్ కూడలిలో వైద్యసిబ్బంది మానవహారం



కవిటి: ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది



కాశీబుగ్గ: నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న వైద్యులు, సిబ్బంది



కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం వైద్యులు, సిబ్బంది ర్యాలీ



సోంపేట: బారువ సీహెచ్‌సీ వద్ద వైద్యసిబ్బంది నిరసన

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో హైడ్రామా!



బాలకృష్ణాపురం పాఠశాలలో హెచ్ఎం కృష్ణారావుతో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణ



దంత పాఠశాల వద్ద టెక్కలి సీఐ శ్రీనివాసరావు, కోటబొమ్మాళి ఎస్ఐ మహమ్మద్ అలీ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బాలకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో టీడీపీ నాయకుల హైడ్రామాతో మరోసారి ఎస్ఎంసీ ఎన్నిక నిలిచిపోయింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు సభ్యుల ఎంపికలో రెండో తరగతి మినహా వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 2వ తరగతిలో 12 మంది విద్యార్థులు ఉండగా, టీడీపీ మద్దతుదారులు ఆరుగురు, వైఎస్సార్ సీపీ మద్దతుదారులు నలుగురు, ఇద్దరు ఎస్సీలు ఉన్నారు. శనివారం చైర్మన్ ఎన్నిక లాంఛనమే అనుకున్న సమయంలో టీడీపీ మద్దతుదారులు గైర్హాజరు కావడంతో పాటు ఇద్దరు ఎస్సీ సభ్యులు లేకపోవడంతో ఎన్నిక నిలిచిపోయినట్లు హెచ్ఎం కృష్ణారావు తెలిపారు. ఎటువంటి గొడవలు జరగకుండా రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణ తన సిబ్బందితో పాఠశాల వద్దనే పర్యవేక్షించారు. వాయిదా పడిన ఈదుపురం కంచ్రావార్డు ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక సక్రమంగా పూర్తయినట్లు ఎంఈఓ కురమాన అప్పారావు ప్రకటించారు.

దంతలో ఎన్నిక వాయిదా

కోటబొమ్మాళి: దంత ప్రాథమికోన్నత పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నిక ఈ నెల 8న టీడీపీ వర్గీయుల ఒత్తిడితో వాయిదా పడగా శనివారం మళ్లీ వాయిదాపడింది. టీడీపీకి సరిపడా మెజార్టీ లేకపోవడంతో హెచ్ఎంపై ఒత్తిడితెచ్చి ఎన్నిక వాయిదా వేయించినట్లు సమాచారం. ఈ మేరకు హెచ్ఎం గొండు నారాయణరావు మాట్లాడుతూ 1, 2, 4 తరగతుల్లో కోరం లేక ఎన్నిక వాయిదా వేసినట్లు తెలిపారు. పాఠశాలలో 48 మంది విద్యార్థులు ఉండగా 1 నుంచి 8వ తరగతి వరకూ ఎన్నికలు నిర్వహించారు. 3, 5, 6, 7, 8 తరగతుల్లో వైఎస్సార్ సీపీ వర్గీయులకు మెజార్టీ ఉండటంతో ఎన్నిక నిర్వహించి సభ్యులను ఎన్నుకున్నారు. 1, 2, 4 తరగతుల్లో కోరం సరిపోలేదంటూ ఎన్నిక వాయిదావేశారు.

ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా పుష్పావతి



నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం ఉన్నత పాఠశాల పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్‌గా అర్ధిమి పుష్పావతి ఎన్నికయ్యారు. ఎంఈఓ జి.నర్సింహులు పర్యవేక్షణలో హెచ్ఎం బమ్మిడి జగన్నాథరావు బందోబస్తు నడమ 24 మంది సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలైన అర్ధిమి పుష్పావతి 14 ఓట్లు సాధించి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన పొట్నూరు జోగారావు వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కణితూరు ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. టీడీపీ కూటమి, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కాకుండా తటస్థ అభ్యర్థిని ఎన్నుకోవాలని చూసినా కూటమి సభ్యుల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది. టెక్కలి డిప్యూటీ డీఈఓ విలియమ్స్, నందిగాం ఎంఈఓ-2 చిన్నారావు పర్యవేక్షించారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు నగదు అందిస్తున్న వెంకటరమణ

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు అన్నారు. శనివారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందిన నెయ్యిల చరణ్‌కు రూ.3000, అతుల్ భరద్వాజ్‌కు రూ.2000, (ప్రియా సాత్వికకు రూ.1500), దేవరాజు, మణికంఠ, కోదండరావులకు చెరో రూ.1000 వంతును నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ మొత్తాన్ని ప్రగడ బుచ్చమ్మ, కల్యాణీ స్మారకార్థం రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రగడ వెంకటరమణ అందించారని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ టి.మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



జీవామృతం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మధు

వజ్రపుకొత్తూరు: ఖరీఫ్ వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని పలాస వ్యవసాయ శాఖ ఏడీఏ ఎల్.వి.మధు అన్నారు. శనివారం పాతటెక్కలిలో ఆరోగ్యవంతమైన పంట పండించే పద్ధతులు(జీఏపీ) పొలంబడి రైతులకు అవగాహన కల్పించారు. సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు వివరించారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే మేలైన ఫలితాలు వస్తాయని చెప్పారు. అనంతరం ద్రవ జీవామృతం తయారు చేసే విధానాన్ని ఏపీసీఎన్ఎఫ్ అధికారి సంగీత వివరించారు. కార్యక్రమంలో ఏఓ పి.కిరణ్ వాణి, ఏఈఓ పి.ఉదయ్, గ్రామపెద్దలు టి.ధర్మారావు, పిరియా శివప్రసాద్, పిరియా తిరుమలరావు, దాసరి దాలయ్య, గాడి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సాగునీటి సమస్య



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర, మలగాం పంచాయతీల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం పర్యటించారు. వంశధార నీరు రావడం లేదని పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వంశధార అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.ప్రభాకర్, రెడ్డి అప్పన్న, పంగ అసిరినాయుడు, త్రినాధరావు, దూపాన కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఎండిన నారుమడులను వ్యవసాయాధికారులకు చూపిస్తున్న రైతులు

సోంపేట: మండలంలోని గొల్లూరు, ఉప్పలాం, సిరిమామిడి గ్రామాల్లో వరి పొలాలను వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, సిబ్బంది శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాలు కురవకపోవడంతో నారు మడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. 50 రోజులు దాటిన జీలుగ, జనుము పంటలను కొద్దిగా వర్షం కురిసిన వెంటనే భూమిలో కలియదున్నాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పూజ తదితరులు పాల్గొన్నారు.

సోంపేటలో సంఘ ఐక్యతా అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న పాస్టర్లు

సోంపేట: సోంపేటలోని ఆంధ్రాబాప్టిస్టు చర్చిలో సి.బి.సి.ఎస్.సి కన్సల్టేషన్, సంఘ ఐక్యతా అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ చర్చిస్ అధికారులు బిషప్ జాన్ ఎస్.డి.ఆర్ నక్కా, డాక్టర్ జి.సామ్యేలు సుధీర్, వి.ఆల్ ఫ్రెడ్ సుధాకర్ చర్చిల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కె.అబ్రహం, ప్రత్తి అన్వీష్, దీపక్ కుమార్, రెయ్యా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

19న గుమ్మా పోటీలు

టెక్కలి: ఈ నెల 19న రాఖీ పండగ సందర్భంగా సాయంత్రం 2 గంటలకు టెక్కలి ఆది ఆంధ్రా వీధిలో గుమ్మా పోటీలు నిర్వహించనున్నామని గుమ్మాకమిటీ సభ్యులు పినిమింటి ఉమాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీలను సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో నిర్వహిస్తామని, పేర్ల నమోదుకు 7702285904ను సంప్రదించాలని కోరారు.

వినాయక ఉత్సవాలకు పందిరిరాట

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లిలో శనివారం జి.లింగమూర్తి, లలిత కుమారి ఆధ్వర్యంలో వినాయక ఉత్సవ పందిరిరాట పూజలు ఘనంగా నిర్వహించారు. వచ్చే నెల 7 నుంచి జరగనున్న వినాయక మండపాల ఏర్పాటుకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అభ్యసన సామగ్రితో బోధిస్తే ఉత్తమ ఫలితాలు

ఇచ్ఛాపురం రూరల్: ప్రాథమిక స్థాయి పిల్లలకు అభ్యసన సామగ్రితో బోధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ కురమాన అప్పారావు అన్నారు. శనివారం లొద్దపుట్టి ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదవడం, రాయడం వంటి ప్రాథమిక సామర్థ్యాలను పిల్లలకు అలవాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుడు కీలు సోమేశ్వరరావు బోధన అభ్యసన సామగ్రి తయారీపై అవగాహన కల్పించారు.

1100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కాశీబుగ్గ: మందస మండలం కొండాలోగాం పంచాయతీ జన్నివీధి గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1100 లీటర్ల బెల్లం ఊటను సెబ్ ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, యోగి నాయుడు తదితరులు ధ్వంసం చేశారు. ఎక్కడ సారా తయారైనా, అమ్మినా 9440902358 నంబరుకు తెలియజేయాలని కోరారు.

బెలగాంలో ఎరువుల పంపిణీ

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం రైతు సేవా కేంద్రంలో రైతులకు శనివారం ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామపెద్దలు మద్దిలి ఈశ్వరరావు, సంతోష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారుల్లో అలజడి



టెక్కలిలో ఇందిరాగాంధీ జంక్షన్‌లో ఫుట్‌పాత్ వ్యాపారాలు

- షాపుల తొలగింపునకు ఇటీవలే ఆదేశాలు జారీ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: టెక్కలి ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ దుకాణాలతో అస్తవ్యస్తంగా ఉంది.. వాటిని తొలగించండి..అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేద్దాం.. అంటూ మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల టెక్కలిలో నిర్వహించిన సమీక్షలో రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో ఆయా దుకాణాలను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి ఇక్కడున్న వారంతా నిరుపేద, సామాన్య వర్గాలకు చెందిన వారే. చిన్నపాటి ఫుట్‌పాత్ వ్యాపారాలతో జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు వాటిని తొలగిస్తే తమ జీవనం ఎలా అంటూ వారు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు విషయం పక్కన పెడితే, చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్న తమను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయని మదనపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ మంత్రి ప్రకటనతో ఫుట్‌పాత్ వ్యాపారుల్లో అలజడి మొదలైంది.